క్లుప్తంగా

ఏపీఎస్పీ బెటాలియన్‌కు ఉచిత వైద్య సేవలు


శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బెటాలియన్ అడిషనల్ ఎస్పీ అర్జున్

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ సిబ్బందికి ఇనోదయ ఆస్పత్రి వైద్యులు శుక్రవారం ఉచిత వైద్య సేవలను అందజేశారు. వైద్య శిబిరాన్ని అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ ప్రారంభించారు. వైద్యులు మదన్, మాధవరావు, విజయరాజ్, సునీల్, లక్ష్మీదేవి సిబ్బందికి వైద్య సేవలందించారు. శిబిరంలో అసిస్టెంట్ కమాండెంట్లు సత్యనారాయణ, మురళి, ఆర్‌ఐలు రవిశంకర్, రాము, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత


స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఈవీఎం, వీవీ ప్యాట్ ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. రోజువారి పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం ఆయన జేఎన్టీయూకే ఆవరణలోని ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌లను సందర్శించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని ఆర్వో వెంకటరావు తెలిపారు. అలాగే నిరంతరం సీసీ కెమెరాల నిఘా కూడా ఉందన్నారు. మరోవైపు ఇద్దరు గెజిటెడ్ అధికారుల సమక్షంలో నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. ఆయన వెంట పలువురు ఎన్నికల అధికారులు ఉన్నారు.

సుభద్ర ఆర్కేడ్‌లో అగ్నిప్రమాదం

రూ.30 వేల ఆస్తి నష్టం

కాకినాడ క్రైం: కాకినాడ భానుగుడి కూడలిలో ఉన్న వ్యాపార సముదాయాల కేంద్రం సుభద్ర ఆర్కేడ్‌లో ఓ వ్యాపార సంస్థలో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. లలితా ట్రేడర్స్ పేరుతో కొనసాగుతున్న సదరు సంస్థకు విద్యుత్ పంపిణీ అవుతున్న మీటర్ ప్యానళ్ల షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నికి ఆహుతై ఆ మంటలు వ్యాపించాయి. దుకాణ యజమాని జి.శివకుమార్ సమాచారంతో అక్కడికి చేరుకున్న సాలిపేట ఫైర్ అధికారి సుబ్బారావు ఆయన బృందం మంటలను అదుపు చేశారు. సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది నష్ట తీవ్రతను రూ.30 వేలకు పరిమితం చేశారు.

పశ్చిమ బెంగాల్ హైకోర్టు తీర్పు హర్షణీయం

బోట్‌క్లబ్: ఓట్ల కోసం దేశ భద్రతకు ముప్పు తెచ్చేలా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన బీజేపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2012లో మమతా బెనర్జీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఓబీసీ చట్టాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టివేయడాన్ని ఆయన స్వాగతించారు. పశ్చిమ బెంగాల్ న్యాయస్థానం 2010 నుంచి బెంగాల్ ప్రభుత్వం జారీచేసిన సుమారు ఐదు లక్షల ఓబీసీ సర్టిఫికెట్లను రద్దు చేయడంపై ఆయన హర్షం ప్రకటించారు. రానున్న బెంగాల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆమె ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారన్నారు.

బాటిళ్లలో పెట్రోలు విక్రయిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల అనంతరం హింసాత్మక సంఘటనల నేపథ్యంలో బంకుల్లో ఖాళీ బాటిళ్లలో పెట్రోలు వేయరాదని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, పెట్రోల్ బంక్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ బాటిళ్లు, డబ్బాల్లో పెట్రోలు పోయవద్దని సూచించారు. గ్రామాల్లో కిళ్లీ, కిరాణా దుకాణాల వద్ద బాటిళ్లలో పెట్రోలు విక్రయించే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలుల్లో ఉన్న నేపథ్యంలో అధికారుల సూచనలు పాటించాలన్నారు. బాటిళ్లలో పెట్రోలు వేసిన వారి సమాచారాన్ని అధికారులకు తెలియపరచాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ, ఈఓపీఆర్డీ భాస్కరరావు పాల్గొన్నారు.


సూర్యారావుపేటలో వర్షపునీటిలో ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనచోదకుడు


వర్షపునీటిలో వీధి కుళాయి నుంచి తాగునీరు పట్టుకుంటున్న వ్యక్తి


వాకలపూడిలో నిలిచిన వర్షపునీరు

నగరం జలసంద్రం

- పలు రహదారుల్లో నిలిచిన వర్షపు నీరు
- ఇబ్బందులు పడిన కాకినాడ ప్రజలు


వలసపాకలలో వర్షపునీటితో నిండిన వీధి

బోట్‌క్లబ్: ఉదయం నుంచి వేడిగాలులు, సాయంత్రం ఉరుములు మెరుపులతో హోరున కురిసిన వర్షానికి కాకినాడ నగరం జలసంద్రమైంది. సుమారు గంటన్నరపైగా కురిసిన వర్షానికి నగరంలో పలు రహదారులు సెలయేళ్లను తలపించాయి. వర్షం కురుస్తున్నంత సేపు రోడ్లు కనపడని విధంగా వర్షపునీరు రోడ్లపైనే నిలిచింది. మధ్యాహ్నం మూడు గంటలకు వాతావరణం ఒక్కసారిగా మార్పు రావడంతో కారు మబ్బులు కమ్ముకొన్నాయి. అప్పుడే చీకటి పడిందా అన్న భ్రమ కలిగింది. మూడు గంటలకు ప్రారంభమైన భారీ వర్షం 4.30 వరకూ జల్లులు పడడంతో నగరంలో పలు ప్రాంతాలు నీట మునిగాయి. హోరున కురిసిన వర్షానికి నగరంలో పలు ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. ప్రధాన రహదారులు సైతం మోకాలి లోతు నీరు చేరడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. స్థానిక సాంబమూర్తినగర్, విద్యుత్‌నగర్, ఎల్‌బీ నగర్, జగన్నాథపురం, శశికాంత్ నగర్, సిద్ధార్థనగర్, సూర్యారావుపేట, సినిమా రోడ్డు, గాంధీనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షపు నీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం తగ్గిన అనంతరం కొద్దికొద్దిగా వర్షపు నీరు తగ్గడంతో నగర ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. వర్షం తగ్గిన తర్వాత గమ్యస్థానాలకు వెళ్లేందుకు పలు రహదారుల్లో వాహన చోదకుల ఇబ్బందులు వర్ణనాతీతం. భారీగా కురిసిన వర్షానికి కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ వర్షపునీటితో నిండిపోయింది. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి బయటకు వచ్చే ప్రయాణికులు, వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పెద్దమార్కెట్ ప్రాంతంలోని పలు రహదారులు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు అడుగు బయటకు పెట్టేందుకు సైతం వీలు లేకుండా వీధుల్లో వర్షపునీరు చేరింది. పెద్దమార్కెట్‌లోని చిరు వ్యాపారులు వర్షం పడడంతో బేరాలు లేక డీలా పడ్డారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో రోడ్డుపై మామిడి కాయలు విక్రయించే వ్యాపారులు చాలా అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం వరకూ వాతావరణం బాగానే ఉండడంతో వ్యాపారులు రోడ్డుపక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకొన్నారు. సాయంత్రం మూడు గంటలు తర్వాత ఒక్కసారిగా హోరుగాలి అనంతరం ఉరుములతో కూడాన వర్షం రావడంతో మామిడికాయలు సురక్షిత ప్రాంతాలకు తరలించే సమయం కూడా ఇవ్వకపోవడంతో వ్యాపారులు బాధలు వర్ణనాతీతం. వర్షం తగ్గిన తర్వాత కూడా మామిడికాయలు కొనుగోలు చేసేందుకు ప్రజలు రాకపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో వ్యాపారులు డీలాపడ్డారు. ఉన్న మామిడికాయలు, పండ్లను తక్కువ రేట్లుకు విక్రయించాల్సి వచ్చింది.

తగ్గిన వేసవి తాపం

కాకినాడ రూరల్: ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుండపోత వర్షంతో కాకినాడ, పరిసర గ్రామాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్న వేసవి తాపం ఒక్కసారిగా తగ్గిపోయింది. తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా పడిన వర్షానికి వీధులు జలమయమవ్వగా జన జీవనం కొద్ది సేపు స్తంభించింది. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తగా సరఫరాను నిలిపివేసి, సాయంత్రం నుంచి పునరుద్ధరించారు. కాకినాడ రూరల్‌లో వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, చీడిగ, కొవ్వాడ తదితర గ్రామాలలో పల్లపు ప్రాంతాలలో నీరు నిలిచింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఉపశమనం ఇచ్చింది.

ఉదయం ఉష్ణతాపం.. సాయంత్రం వర్షపాతం..


కరపలో వేసవి తాపానికి మధ్యాహ్నం నిర్మానుష్యంగా కనిపిస్తున్న మెయిన్‌రోడ్డు


సాయంత్రం దట్టంగా మబ్బులు పట్టిన ఆకాశం


కరపలో కురుస్తున్న వర్షం

కరప: అసలే పెద్దకార్తె ఎండలు. ఆపై ప్రచండ భానుడి ప్రతాపం. శుక్రవారం ఉష్ణతాపానికి ప్రజలు విలవిల్లాడారు. అల్పపీడన ప్రభావంతో అప్పుడప్పుడు వర్షాలు పడినా నాలుగురోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోయారు. వేసవి తాపం గురించి భయాందోళనలు వ్యక్తం చేస్తుండగానే సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని పగలే చీకటిగా మారింది. వాహనచోదకులు లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. చల్లటిగాలులు వీచడంతో చిన్నారులు బయటకువచ్చి కేరింతలు కొడుతూ సందడి చేశారు. కొద్దిసేపటికి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది, కొన్ని గ్రామాల్లో చిరుజల్లులు పడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. రబీపంట ఈ ఏడాది ఆలస్యమైన మెరక, కాలువశివారు ప్రాంతాల్లో కోతలు ముమ్మరంగా చేపట్టారు. వరికోత యంత్రాలతో కోసిన పంట కళ్లాల్లోను, లే అవుట్లలోను ధాన్యం రాశులు చేసి ఉంచామని, గాలులకు రాశులపై కప్పిన బరకాలు ఎగిరిపోయి, తడిసిపోయాయని రైతులు తెలిపారు. ఈ ఏడాది మామిడిపంట అంతంతమాత్రంగా ఉందనుకుంటే గాలివానకు మామిడికాయలు రాలిపోయి, నష్టపోయామని మామిడిరైతులు ఆవేదన వ్యక్తంచేశారు. పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాల్లో ఉప్పురాశులు వర్షానికి దెబ్బతిన్నట్టు ఉప్పురైతులు తెలిపారు. శనివారం నుంచి రోహిణీకార్తె కలుస్తుందని, వేసవి ప్రారంభం నుంచి వడగాడ్పులతో అపసోపాలు పడిన ప్రజలు, రోహిణిలో కాచే ఎండలు ఎలా భరించాలో అని దిగులు చెందుతున్నారు. ఇంతలో మబ్బులు పట్టి పడిన వర్షం వారికి కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది.

వైభవంగా భావనారాయణుని శ్రీపుష్పయాగం


కళాకారుల నృత్యాల నడుమ ఊరేగుతున్న స్వామివారు


శ్రీపుష్ప యాగోత్సవంలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీపుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదర్శనలు నిర్వహించారు. ఒక్కో ప్రదర్శనకు ఒక్కో వాయిద్యం, ఒక్కో నైవేద్యం సమర్పించారు. 11వ ప్రదర్శనలో కళాకారుల నృత్యాలతోను, 12వ ప్రదర్శనలో మౌనంగానూ స్వామివారిని ఊరేగించారు. అనంతరం రాత్రి 9 నుంచి శ్రీపుష్పయాగం పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వెంకటాచార్యులు, రామకిరణ్, పద్మనాభాచార్యులు, హరి, శ్రీనివాస్, గిరిబాబు తదితరులు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. ఆలయ ఏవో భీమేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణమహోత్సవాలు శుక్రవారం రాత్రితో ఘనంగా ముగిసాయి. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. చివరి రోజు శ్రీపుష్పయాగంలో పాల్గొన్న 100 మంది దంపతులకు కొబ్బరిబొండాలతో తాంబూలాలు అందజేశారు.

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతులు


పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

- 27 వరకు నీటి సరఫరాకు అంతరాయం
- 12 ట్యాంకర్లతో ప్రతి రోజూ 69 ట్రిప్పుల నీటి సరఫరా
- కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కాకినాడ అచ్చంపేట–ఉండూరు సమీపంలో పైప్‌లైన్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పైప్‌లైన్ మరమ్మతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్‌ప్లాంట్‌కు వెళ్లే ముడినీటి సరఫరా పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయన్నారు. వీటిని అరికట్టేందుకు ఈ నెల 23, 24, 25 తేదీలలో 1 నుంచి 13వ డివిజన్ వరకు అంటే శశికాంత్‌నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, గైగోలుపాడు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టామన్నారు. అయితే శుక్రవారం కురిసిన భారీవర్షం వల్ల పైపులైన్ మరమ్మతులకు అంతరాయం కలిగిందని, ఈ నెల 26, 27 తేదీలలో కూడా ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా

1 నుంచి 13వ డివిజన్ వరకు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థకు చెందిన ఆరు ట్యాంకర్లతో పాటు మరో ఆరు అద్దె ట్యాంకర్లను కూడా రప్పించామన్నారు. వీటి ద్వారా గురు, శుక్రవారాలలో 69 ట్రిప్పుల చొప్పున ప్రజలకు నీరు అందించామన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఎదురైతే మొబైల్ నెంబర్లు 98499 06507, 99597 99138, 96767 70461, 98484 71415 నెంబర్లను సంప్రదించవచ్చునని కమిషనర్ సూచించారు.

గెలుపుపై చర్చోపచర్చలు

- అభ్యర్థులు, ప్రజల్లో ఉత్కంఠ
- నగరవాసులతో ఆరా తీస్తున్న బంధుమిత్రులు

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో గెలుపు ఎవరి సొంతమనే అంశంపై చర్చలు, విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. ఫలితం తేలడానికి మరో వారం రోజులు సమయం ఉండగా, గెలుపోటములపై అభ్యర్థులతో పాటు ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది.

మహిళలు ఎవరి వైపు..

కాకినాడ సిటీ నియోజకవర్గం బరిలో ఎవరు గెలుస్తున్నారంటూ పొరుగు నియోజకవర్గాల వారు కూడా ఇక్కడ ఉన్న వారి బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు. ఈసారి ఎన్నికల పోలింగ్‌లో యువకులు, మహిళలు, వలస ఓటర్లు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న నేపథ్యంలో వీరంతా ఏ పార్టీ వైపు నిలబడ్డారనే అంశంపై ప్రధానంగా చర్చ నడుస్తోంది. ఓటుకు నోటు ప్రభావం ఎంతవరకు ఉంటుందనే దానిపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఆ సామాజికవర్గం ఓట్లపై సందేహాలు

నియోజకవర్గం టీడీపీ సీటు విషయంలో మొదటి నుంచి మత్స్యకార సామాజికవర్గం వారే ఆధిపత్యం వహిస్తున్నారు. ఈ సీటును ఆ సామాజికవర్గానికి చెందిన వనమాడి వెంకటేశ్వరరావుకు ఇస్తున్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సొంత సామాజిక వర్గాన్ని విస్మరించడంతో వారంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారు. వీరికి తోడు కాపు, శెట్టిబలిజ, వైశ్య సామాజిక వర్గాల వారు కూడా ఆ పార్టీకే మొగ్గు చూపుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి వెంట నడుస్తున్నారు.

ఈసారి కూడా టీడీపీ సీటు వనమాడికే ఇవ్వడంతో మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన అధిక శాతం నాయకులు, యువకులు, మహిళలు ప్రస్తుత ఎమ్మెల్యే, సిటీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వైపే నిలిచారని చెప్పవచ్చు. మత్స్యకారులు, కాపు, శెట్టిబలిజ, వైశ్య సామాజిక వర్గాలకు చెందిన వారు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గు చూపడంతో టీడీపీ నాయకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏది ఏమైనా గెలుపోటములపై ఈ రాజకీయ చర్చలకు జూన్ 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపుతోనే తెరపడనుంది.

ఎవరి లెక్కలు వారివే..

ఎన్నికల ప్రక్రియ ముగియడంతో గెలుపోటములపై ఆయా పార్టీల అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో కాకినాడ సిటీలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసింది. ప్రస్తుత ఎన్నికల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గెలుస్తారనే చర్చ నియోజకవర్గంలో విస్తృతంగా సాగుతోంది. ఇక టీడీపీ నేతలు పైకి ధీమా వ్యక్తం చేస్తున్నా.. లోలోన డీలా పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాకినాడ సిటీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో గెలుపుపై వైఎస్సార్ సీపీ ధీమాగా ఉంది. టీడీపీ నేతలు పైకి విజయం తమదేనని చెబుతున్నా లోలోన ఆందోళన చెందుతున్నారు.

సేవే పరమావధిగా..


మానసిక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న సిబ్బంది

- దివ్యాంగులకు అండగా అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్
- ఫిజియోథెరపీకి చిరునామాగా మారిన వైనం

తాళ్లరేవు: సేవే పరమావధిగా సాగుతున్నారు.. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.. అందరికీ ఆదర్శవంతమైన సేవలు అందిస్తున్నారు.. కోరంగి పంచాయతీ సీతారామపురంలోని ధీరూభాయ్ అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ అనేక మందికి వివిధ సేవలందిస్తూ అండగా నిలుస్తుంది. ఖరీదైన వైద్యాన్ని సైతం ఉచితంగా అందించడం, మానసిక వికలాంగులను అక్కున చేర్చుకుని వారిని సకలాంగులుగా తీర్చిదిద్దడం తదితర నిరంతర సేవలతో ప్రజల మన్ననలు పొందుతోంది. తాళ్లరేవు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ఇక్కడకు వచ్చి సేవలతో స్వాంతన పొందుతున్నారు. మండలంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్మించిన అనంతరం వారి ఆర్థిక సహాయంతో 2009లో రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్ పేరిట సేవలను ప్రారంభించారు. ఉమా మనోవికాస కేంద్రం సహకారంతో దివ్యాంగుల పాఠశాలతోపాటు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు కొండంత అండగా నిలుస్తున్నారు. 2017 వరకూ అద్దె భవనంలో కొనసాగిన సేవలు ఐదేళ్ల కిందట సీతారామపురంలోని సొంత భవనంలోకి మారాయి. ప్రధానంగా తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన మానసిక దివ్యాంగులను గుర్తించి వారిని సాధారణ పిల్లలుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్నారు. వారిలో మార్పు తీసుకురావడంతోపాటు ప్రత్యేకమైన విద్యనందించి సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల కాలంలో అధిక శాతం మంది కాళ్లు, చేతులు, మెడ తదితర నొప్పులతో బాధపడడం చూస్తున్నాం. వీటికి ప్రధానంగా మందులతోపాటు ఫిజియోథెరపీ చేయిస్తేనే శాశ్వతంగా నయమవుతుందని వైద్యులు చెబుతుంటారు. ఈ కేంద్రంలో ఎటువంటి రుసుం తీసుకోకుండా ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించడం విశేషం. వివిధ రకాల నొప్పులతో బాధపడుతూ ఈ కేంద్రానికి వచ్చేవారిని తిరిగి మామూలు వ్యక్తులుగా మార్చి పంపిస్తున్నారు. ధనిక, పేద అనే తేడా లేకుండా వైద్యం కోసం వచ్చిన వారందరికీ సేవలందించడం ప్రత్యేకత. అందుకే ఈ కేంద్రం ఫిజియోథెరపీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అలాగే స్పీచ్‌థెరపీ, మ్యూజిక్ అండ్ యోగా థెరపీ, ఒకేషనల్ ట్రైనింగ్ తదితర సేవలు అందిస్తున్నారు. 13 ఏళ్లుగా నిరాటంకంగా సేవలు కొనసాగుతున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- పార్టీల నేతలు సంయమనం పాటించాలి
- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం: ఓట్ల లెక్కింపు సమయంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, రాజకీయ పార్టీల నేతలు సంయమనం పాటించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం పిఠాపురం మున్సిపల్ కల్యాణ మండపంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుపై రాజకీయ పార్టీ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగా, పోలింగ్ సైతం ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్, పోలీస్ యాక్టు 30 అమలులో ఉంటుందని చెప్పారు. అందరూ ఆయా నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీల నాయకులు తమ కార్యకర్తలను సంయమనం పాటించేలా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే, వారి జీవితాలు చిన్నాభిన్నమవుతాయని హెచ్చరించారు. ఎవరూ వివాదాలకు, ఘర్షణలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దని హితవుపలికారు. ఎవరూ గుంపులుగా తిరగరాదన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఉంటుందని, ప్రశాంత వాతావరణంలో లెక్కింపు పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, సీఐ శ్రీనివాస్, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.